సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం ౹ 20 ౹ జనవరి ౹ 2025





### నిత్యాన్నదానానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు బొగ్గవరపు సత్యనారాయణ, ఝాన్సీలక్ష్మి దంపతులు (రాజమహేంద్రవరం) రూ.51,116 విరాళం అందజేశారు.




### ఆదర్శ కృషీమణులు

8లో

ప్రకృతి వ్యవసాయం ద్వారా పలు పంటలు సాగు చేస్తూ.. రసాయనిక వ్యవసాయం దుష్పరిణామాలను వివరిస్తూ.. ఆ మహిళా రైతులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.


### డెల్టాలకు 9,745 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 9,745 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.75 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### అహంకారాన్ని దూరం చేసుకుంటేనే ఆనందం



ప్రసంగిస్తున్న గరికిపాటి

రాజమహేంద్రవరం రూరల్: నేను, నాది అనే అహంకారాన్ని దూరం చేసుకుంటే స్వార్థ రహిత సేవ ద్వారా ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందవచ్చునని మహా సహస్రావధాని పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు అన్నారు. భగవాన్ సత్యసాయి బాబా శతజయంత్యుత్సవాల సందర్భంగా స్థానిక సత్యసాయి గురుకులంలో ప్రేమ, సేవ అనే అంశంపై ఆయన ఆదివారం రాత్రి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. బ్రహ్మజ్ఞానం లేనప్పుడు ఎన్ని చదువులు చదివినా సార్థకత ఉండదన్నారు. ఆధ్యాత్మికతలోని శాస్త్రీయతను గుర్తించి, ఆత్మజ్ఞానం పొంది సేవ, ప్రేమ అలవర్చుకోవడానికి నిరంతర సాధన చేయాలని సూచించారు. వార్ధక్యాన్ని వరంగా భావిస్తూ, గత జ్ఞాపకాలను ఒంటరిగా స్మరించుకుంటూ ఆధ్యాత్మిక పయనం సాగించాలన్నారు. డబ్బు, పొగడ్త, భయం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఎవరి గురించి వారే ఆలోచించి, కష్టాన్ని కూడా సుఖంగా మార్చుకోవాలని సూచించారు. చిత్తశుద్ధితో చేసే ఏ పనైనా మోక్షాన్ని అందిస్తుందని చెప్పారు. విద్య, వైద్యం, తాగునీరు వంటి అనేక సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టి 250 దేశాల్లో ఉన్న సత్యసాయి సేవా సంస్థలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవలో నేటి యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులకు సేవ, పితృకార్యాలు చేయడంలో అశ్రద్ధ వద్దని, జీవ కారుణ్యం పెంచుకోవాలని గరికిపాటి సూచించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సత్య సాయిబాబా శతజయంత్యుత్సవాల సందర్భంగా నవంబర్ 23 వరకూ పలు సమాజ సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థల కాకినాడ, కోనసీమ జిల్లాల అధ్యక్షులు యార్లగడ్డ గోవింద రాజులు, అడబాల వెంకటేశ్వరరావు, గురుకులం కరస్పాండెంట్ అయోధ్యుల శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ గురవయ్య, ప్రముఖ వైద్యులు గోలి రామారావు తదితరులు గరికిపాటిని ఘనంగా సత్కరించారు. రంగంపేటకు చెందిన సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ సబ్బు బిళ్ళపై గరికిపాటి ముఖచిత్రాన్ని చిత్రీకరించి బహూకరించారు.

### రూ.3.78 కోట్లతో హాస్టళ్లకు మరమ్మతులు



కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం) జిల్లాలోని 24 సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ వసతి గృహాల్లో రూ.3.78 కోట్లతో మరమ్మతులు చేపట్టనున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో పైకప్పు, ఫ్లోరింగ్ మరమ్మతులతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, కరెంటు పనులు, దోమల నివారణ మెష్‌ల ఏర్పాటు, బాలికల వసతి గృహాలకు ప్రహరీల నిర్మాణం వంటి పనులు చేపడతామని వివరించారు. గోపాలపురం నియోజకవర్గంలో 10 హాస్టళ్లకు రూ.144.84 లక్షలు, రాజమహేంద్రవరం సిటీలో ఆరింటికి రూ.70.01 లక్షలు, రాజమహేంద్రవరం రూరల్‌లో రెండింటికి రూ.32.51 లక్షలు, గోకవరం మండలంలో ఒక హాస్టల్‌కు రూ.17.05 లక్షలు, రాజానగరం నియోజకవర్గంలో ఒక హాస్టల్‌కు రూ.11.05 లక్షలు, రంగంపేటలో ఒక హాస్టల్‌కు రూ.11.29 లక్షలు, కొవ్వూరులో రెండింటికి రూ.52.53 లక్షలు, నిడదవోలు నియోజకవర్గంలో 3 హాస్టళ్లకు రూ.38.32 లక్షల చొప్పున కేటాయించామని వివరించారు.

# ఉద్యోగులపై కత్తి

- సచివాలయ వ్యవస్థ నిర్వీర్యానికి ప్రయత్నాలు
- హేతుబద్ధీకరణ దిశగా కూటమి సర్కార్ అడుగులు
- ఉద్యోగుల కుదింపే లక్ష్యం
- ప్రస్తుతం ఒక్కో సచివాలయంలో 11 మంది సిబ్బంది
- రేషనలైజేషన్ ద్వారా 6 నుంచి 8 మందితో సరిపెట్టాలని యోచన
- ఇతర శాఖలకు మిగిలిన వారిని బదిలీ చేసేందుకు యత్నం




సాక్షి, రాజమహేంద్రవరం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలను గుమ్మం వద్దనే అందించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. హేతుబద్ధీకరణ పేరుతో ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకుంది. ఇప్పటికే జాబ్‌చార్ట్‌లో లేని పనులు చేయిస్తూ ఒత్తిడికి గురి చేస్తున్న సర్కారు.. తాజాగా ఉద్యోగుల కుదింపునకు శ్రీకారం చుట్టింది. అమరావతిలో శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం దీనికి సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ నిర్ణయం అమలులోకి వస్తే.. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది సచివాలయ ఉద్యోగులు ఇతర శాఖలకు బదిలీ కానున్నారు. కొత్తగా భర్తీ చేయాల్సిన పోస్టులకు సైతం మంగళం పాడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

**ఉద్యోగుల కుదింపునకు కుట్ర**

జిల్లా వ్యాప్తంగా 512 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 119 వార్డు, 393 గ్రామ సచివాలయాలు. వీటిలో 5,513 మంది ఉద్యోగులు ఉండాలి. కానీ, 4,323 మంది మాత్రమే ఉన్నారు. 1,190 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటి వరకూ ఒక్కో సచివాలయంలో 10 నుంచి 11 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారి సంఖ్య గణనీయంగా తగ్గనుంది. 2,500 కంటే జనాభా తక్కువగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆరుగురు, 2,500 నుంచి 3,500 మధ్య జనాభా ఉండే సచివాలయాల్లో ఏడుగురు, 3,500 పైబడి జనాభా ఉండే సచివాలయాల్లో ఎనిమిది మంది చొప్పున మాత్రమే ఉద్యోగులను కొనసాగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా ఒక్కో సచివాలయం నుంచి ఇద్దరు ముగ్గురు ఉద్యోగాలకు ఎసరు పెట్టింది. సగటున ఒక్కో సచివాలయంలో ఎనిమిది మంది ఉద్యోగులను లెక్కగట్టినా.. 1,417 మందికి స్థాన చలనం కలగనుంది. వారిని ఇతర శాఖలకు బదిలీ చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సచివాలయాలకు ప్రస్తుతం ఉన్న ప్రత్యేక సెక్రటరీలకు బదులు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, పట్టణాల్లో వార్డు పరిపాలనా కార్యదర్శి హెడ్‌గా ఉంటారని ప్రభుత్వం చెబుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ ఉద్యోగులకు అత్యంత ప్రాధాన్యం లభించేది. ప్రత్యేకంగా డిపార్ట్‌మెంటల్ పరీక్షలు నిర్వహించి, అర్హత పొందిన కొందరికి పే స్కేల్స్ సైతం అమలు చేశారు. ఇప్పుడు తమ భవిష్యత్తు ఎలా ఉంటుందోననే ఆందోళన పే స్కేల్స్ పొందని వారిలో నెలకొంది.

**జిల్లాలో సచివాలయాల వివరాలు**

| సచివాలయాలు | ఉండాల్సిన ఉద్యోగులు | ఉన్న ఉద్యోగులు | ఖాళీలు | ఖాళీల శాతం |
|---|---|---|---|---|
| 119 (వార్డు) | 1,190 | 940 | 250 | 21.01 |
| 393 (గ్రామ) | 4,323 | 3,383 | 940 | 21.74 |

**1,190 పోస్టుల భర్తీకి మంగళం?**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో జీరో వేకెన్సీకి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. శాఖలో ఖాళీ అయిన ఉద్యోగాల భర్తీకి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 1,190 పోస్టుల భర్తీకి మూడో విడత నోటిఫికేషన్ జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రక్రియకు అప్పట్లో బ్రేక్ పడింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం చేపడుతున్న హేతుబద్ధీకరణ పూర్తయితే కొత్త పోస్టుల భర్తీకి మంగళం పాడినట్లేనని పలువురు భావిస్తున్నారు.

**మూడు కేటగిరీలుగా..**

హేతుబద్ధీకరణ పేరుతో సచివాలయాల ఉద్యోగులను ప్రభుత్వం మూడు కేటగిరీలుగా విభజించనుంది. మల్టీపర్పస్, టెక్నికల్, ఆస్పిరేషనల్ ఫంక్షనరీలుగా విభజించి, జనాభా ఆధారంగా వారిని సచివాలయాలకు కేటాయించనుంది. పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసు మల్టీపర్పస్ ఫంక్షనరీలుగా వ్యవహరిస్తారు. సచివాలయాల్లో కేటాయింపుల అనంతరం మిగిలిన ఉద్యోగుల్లో ఆస్పిరేషనల్ ఫంక్షనరీలను ఎంపిక చేస్తారు. ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), కృత్రిమ మేధ (ఏఐ), మెషీన్ లెర్నింగ్(ఎంఎల్) వంటి ఆధునిక సాంకేతికతను ప్రజల్లోకి తీసుకుని వెళ్లే కార్యక్రమాలకు వీరిని వినియోగిస్తారు.



చాగల్లు మండలం కలవలపల్లి-2 సచివాలయం

**మళ్లీ పాత కష్టాలు**

గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఆవిర్భావానికి ముందు నాలుగు గ్రామాలకు ఒక్క పంచాయతీ కార్యదర్శి మాత్రమే ఉండేవారు. వ్యవసాయ అసిస్టెంట్లు ఎక్కడో ఉండేవారు. మండలానికి ఒక సర్వేయర్, కొన్ని మండలాలకు ఇన్‌చార్జ్ సర్వేయర్లతో ప్రజలు ఇక్కట్లు పడేవారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న హేతుబద్ధీకరణ నిర్ణయంతో పాత రోజులు పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రేషనలైజేషన్‌తో కీలకమైన ఉద్యోగులు రెండు మూడు గ్రామాలకు ఒకరి చొప్పున పని చేయాల్సిన పరిస్థితి మళ్లీ రానుంది. సర్వేయర్ల సమస్య తీవ్రంగా వేధించనుంది.

**నిర్వీర్యమే లక్ష్యంగా..**

ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేయాలనే సదుద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు మన రాష్ట్రంలో అంకురార్పణ చేసింది. కలెక్టర్ల పర్యవేక్షణలో పరీక్ష నిర్వహించి మరీ సచివాలయ ఉద్యోగులను ఎంపిక చేశారు. మెరిట్‌కు ప్రాధాన్యం ఇస్తూ, ఎలాంటి పైరవీలకు తావు లేకుండా ఉద్యోగులను నియమించారు. ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కాయి. వీరితో పాటు ఈ వ్యవస్థలో కీలకమైన వలంటీర్లను స్థానిక అధికారులు ఎంపిక చేశారు. వీరందరూ ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకుని వచ్చారు. గత సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన పాలనా సంస్కరణలకు సమాధి కట్టే ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను పూర్తిగా పక్కన పెట్టగా.. సచివాలయ వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సింది పోయి వారిపై కత్తి దూస్తోంది.

## తెరచుకునేదెప్పుడో..

- 20 రోజులుగా మూత పడిన వాడపల్లి, ఔరంగబాద్ బోట్స్‌మెన్ ర్యాంపులు
- ఇసుక కార్మికులకు తప్పని అవస్థలు



వాడపల్లిలో మూతపడిన ఇసుక ర్యాంపు

కొవ్వూరు: జిల్లాలోనే అతి పెద్ద బోట్స్‌మెన్ సొసైటీ ఇసుక ర్యాంపులు వాడపల్లి, ఔరంగబాద్. ఇవి మూత పడి 20 రోజులు పూర్తయినా, ప్రభుత్వం ఇంతవరకూ వీటిని తెరవలేదు. దీంతో పడవ కార్మికులు ఉపాధి కరవై అల్లాడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 ర్యాంపులకు జల వనరుల శాఖ అధికారులు ఈ నెల 10వ తేదీన షార్ట్ టెండర్లు పిలిచారు. కోటిలింగాల రేవుకు ఈ నెల 15 వరకూ గడువు ఇస్తూ ఈ నెల 4న అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ గడువు కూడా ముగిసింది. కొవ్వూరుకు మార్చి నెలాఖరు వరకూ, ఎరినమ్మ, వాడపల్లి-2, దండగుండ రేవు-1 ర్యాంపులను ఈ నెలాఖరు వరకూ పొడించారు. దండగుండ రేవు-2ను ఫిబ్రవరి 15వ తేదీ వరకూ, ఔరంగబాద్-2ను ఫిబ్రవరి నెలాఖరు వరకూ, గాయత్రీ ర్యాంపు-1ను మార్చి నెలాఖరు వరకూ, మరొకటి ఫిబ్రవరి నెలాఖరు వరకూ పొడిగించారు. కానీ, వాడపల్లి-1, ఔరంగబాద్-1 ర్యాంపుల గడువును ఇప్పటి వరకూ పొడిగించలేదు.

సాధారణంగా గోదావరిలో జూలై రెండో వారం వరకూ వరద జాడ ఉండదు. అప్పటి వరకూ బోట్స్‌మెన్ సొసైటీలతో నడిచే ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలకు అనువైన పరిస్థితులుంటాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి సరిపడే విధంగా ఆయా ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలకు పరిమాణాన్ని లెక్కించి ఒకేసారి అనుమతులు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెప్టెంబర్ మూడో వారంలో ఇచ్చిన అనుమతులు డిసెంబర్ నెలాఖరుకు పూర్తయ్యాయి. ప్రతి రెండు మూడు నెలలకోసారి అనుమతి పొందాల్సి రావడంతో ప్రతిసారీ వారం పది రోజుల పాటు ర్యాంపులు నిలిచిపోతున్నాయి. ఫలితంగా ఇసుకకు డిమాండ్ ఏర్పడి, ధర పెరిగి, వినియోగదారులు నష్టపోతున్నారు. మరోవైపు పడవ కార్మికులు తరచూ ఉపాధి కోల్పోతూ ఇబ్బందులు చవిచూస్తున్నారు. రాజకీయ కారణాలతో తాళ్లపూడి మండలంలోని బోట్స్‌మెన్ ర్యాంపులను ఇంత వరకూ తెరవనే లేదు.

**అందుకే అనుమతులు ఇవ్వడం లేదా!**

వాడపల్లి, ఔరంగబాద్ ర్యాంపుల నుంచి రోజుకు సగటున 500 లారీల ఇసుక సరఫరా చేసే అవకాశం ఉంది. అధికారిక లెక్కల ప్రకారం డివిజన్ మొత్తం మీద పడవల ర్యాంపుల ద్వారా రోజుకు 25 వేల టన్నుల ఇసుక సరఫరా జరుగుతూండగా.. దీనిలో 10 వేల టన్నులకు పైగా ఇసుక వాడపల్లి, ఔరంగబాద్-1 నుంచే సరఫరా జరిగేది. ఈ రెండు ర్యాంపులూ నడిస్తే ఈ ప్రాంతంలో ఇసుకకు కొరత అంటూ ఉండదు. కానీ, ఇంత పెద్ద ర్యాంపులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కూటమి నేతలు కొత్తగా ఏర్పాటు చేసుకున్న ర్యాంపులు నడవడం కోసమే వీటికి అనుమతులు ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ రెండు ర్యాంపుల్లో 300కు పైగా పడవలున్నాయి. వేలాది మంది కార్మికులు నిత్యం ఉపాధి పొందుతున్నారు. రెండు గ్రామాలకూ సంబంధించి 120 వరకూ ఇసుక రవాణా చేసే లారీలున్నాయి. ర్యాంపులు మూతపడటంతో లారీలకు సైతం సకాలంలో ఇసుక దొరకని పరిస్థితి. ఔరంగబాద్-1, వాడపల్లి-1 మినహా మిగిలిన ర్యాంపులను ఇసుక పరిమాణం ఆధారంగా రెన్యువల్ చేశారు. వీటిని తెరవడంపై అధికారులు దృష్టి పెట్టకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

# ఎన్ఐఆర్‌సీఏగా సీటీఆర్ఐ

- పొగాకుతో పాటు వాణిజ్య పంటలపై ఫోకస్
- దేశీయ ఎగుమతుల పెంపునకు తోడ్పాటు
- రైతులకు మరింతగా సేవలు

రాజమహేంద్రవరం రూరల్: ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) ఆధ్వర్యాన పొగాకుపై పరిశోధన, పంట అభివృద్ధికి నిర్దేశించిన కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (ఐసీఏఆర్ – సీటీఆర్ఐ) జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐసీఏఆర్ – ఎన్ఐఆర్‌సీఏ)గా రూపాంతరం చెందనుంది. తద్వారా భవిష్యత్తులో పొగాకు మాత్రమే కాకుండా పలు వాణిజ్య పంటల అభివృద్ధికి కూడా కృషి చేయనుంది. ఆయా పంటలు సాగు చేసే రైతులకు సమగ్ర సేవలు అందించనుంది. ఎన్ఐఆర్‌సీఏను మంగళవారం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, టర్మరిక్ బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ టీఆర్ శర్మ ప్రారంభిస్తారు.

**ఇదీ చరిత్ర**

బ్రిటిష్ పాలనలో మన దేశంలో ఇంపీరియల్ అగ్రికల్చరల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటైంది. దీని ఆధ్వర్యాన 1936లో సిగరెట్ పొగాకు పరిశోధన కేంద్రం గుంటూరులో ఏర్పాటు చేశారు. 1943–44లో పొగాకుపై ఎక్సైజ్ సుంకం విధించడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. ఈ నేపథ్యంలో నాటి ప్రభుత్వం ఇండియన్ సెంట్రల్ టొబాకో కమిటీ (ఐసీటీసీ) 1945లో ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఐసీఏఆర్ ఆధ్వర్యాన 1947లో సీటీఆర్ఐ ఏర్పాటైంది. గుంటూరు, కందుకూరు, జీలుగుమిల్లి, తమిళనాడులోని వేదసందూర్, కర్ణాటకలోని హున్సూర్, పశ్చిమ బెంగాల్‌లోని దిన్హాటాలలో ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా పొగాకు ఉత్పత్తులపై పరిశోధన, పంటల అభివృద్ధికి కృషి జరిగింది. వీటితో పాటు మన రాష్ట్రంలోని కలవచర్ల, కందుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా కూడా కార్యకలాపాలు సాగేవి. ఆయా కేంద్రాల ద్వారా పొగాకు పరిశోధనలో కీలక ఘట్టాలను ఆవిష్కరించారు.



రాజమహేంద్రవరంలోని సీటీఆర్ఐ భవనం

**మార్పు ఎందుకంటే..**

ప్రజారోగ్యం దృష్ట్యా పొగాకు వినియోగం తగ్గడం సాగు, ఉత్పత్తిలో ఎదురవుతున్న పలు సవాళ్లతో విదేశీ మారక ద్రవ్యం పొందేందుకు అవకాశమున్న ఇతర వాణిజ్య పంటలపై సీటీఆర్ఐ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే ఈ సంస్థ ఎన్ఐఆర్‌సీఏగా రూపాంతరం చెందుతోంది. వాణిజ్య పంట ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా మన దేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే అవకాశాలున్నాయని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఎన్ఐఆర్‌సీఏ ద్వారా మిరప, పసుపు, ఆముదం, అశ్వగంధ వంటి వాణిజ్య పంటలపై పరిశోధన – సాంకేతిక అభివృద్ధి, ప్రాసెసింగ్, విలువ జోడింపునకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా దేశీయ వ్యవసాయ ఎగుమతులు పెంచాలని నిర్ణయించింది. తద్వారా ఈ పంటలకు అతి పెద్ద ఉత్పత్తిదారుగా మన దేశాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నారు. మన దేశం ఉత్పత్తి చేసే పొగాకుకు అంతర్జాతీయంగా అత్యంత డిమాండ్ ఉన్నందున దీని సాగుకు తోడ్పాటు అందిస్తూనే, వాణిజ్య పంటలపై కూడా ఎన్ఐఆర్‌సీఏ దృష్టి పెట్టనుంది. పసుపు ఎగుమతుల ద్వారా ఆదాయాన్ని పెంచడంతో పాటు, పసుపు పొడి, ఇమ్యూనిటీ బూస్టర్లు, సబ్బులు, క్యాప్సూల్స్ తదితర ఉత్పత్తులను తయారు చేయనుంది. అలాగే గ్రీన్ చిల్లీ ఫ్లేక్స్, చిల్లీ పౌడర్, రెడ్ చిల్లీ ఫ్లేక్స్, అశ్వగంధ చూర్ణం, గుళికలు, టీ బ్యాగ్‌లను ఎన్ఐఆర్‌సీఏ ద్వారా తయారు చేస్తున్నారు. ఆముదం నూనెలు, పెయింట్లు, రెసిన్లు, ప్లాస్టిసైజర్లు, కొవ్వు, ఆల్కహాల్, ఆముదం ఉప ఉత్పత్తులతో పాటు, అత్యధిక అంతర్జాతీయ మార్కెట్‌ను కైవసం చేసుకోవడంపై దృష్టి సారించనున్నారు. వీటి ద్వారా రైతులకు ఆదాయం పెంచడంతో పాటు, దేశానికి విదేశీ మారకద్రవ్యం కూడా లభిస్తుందని భావిస్తున్నారు.

### అగ్రగామిగా నిలుపుతాం



వాణిజ్య వ్యవసాయంపై పరిశోధన కోసం ఎన్ఐఆర్‌సీఏ అవతరిస్తోంది. దీని ద్వారా లాభసాటి వ్యవసాయం, ఉపాధి అవకాశాలు, పోషకాహారం, నాణ్యమైన ఎగుమతుల కోసం సుస్థిర, శాస్త్రీయ, సాంకేతిక విధానాలను అభివృద్ధి చేస్తాం. పొగాకు, మిరప, పసుపు, ఆముదం, అశ్వగంధ పంటలపై పరిశోధనలు సాగిస్తాం. వాణిజ్య అంశాల పరిజ్ఞానంతో ఎన్ఐఆర్‌సీఏని అగ్రగామిగా నిలుపుతాం.

– డాక్టర్ మాగంటి శేషుమాధవ్, డైరెక్టర్, ఐసీఏఆర్ – ఎన్ఐఆర్‌సీఏ, రాజమహేంద్రవరం



చిత్ర కళా ప్రదర్శనలో ఆకట్టుకున్న 'దీపం వెలుతురులో యువతి' చిత్రం

- జాతీయ చిత కళా ప్రదర్శనలో 500 చిత్రాలతో భావ వ్యక్తీకరణ
- 215 చిత్రకారులతో ముద్రితమైన 'అవర్ ఆర్టిస్ట్స్' పుస్తక సమీక్ష
- జాతీయ స్థాయి విజేతలకు బహుమతుల ప్రదానం



కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొట్టే ఘట్టం



చిత్ర కళా ప్రదర్శనలో 'కొబ్బరి బొండాలు, చెక్కలు, బొండాం నీళ్లు

# కళారే విచిత్రం!

అమలాపురం టౌన్: దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు గీసిన దాదాపు 500 చిత్రాలు ఒకే వేదికపై ప్రదర్శితం కావడంతో అవి చిత్రకళాభిమానులను కనువిందు చేశాయి. అమలాపురంలోని శ్రీసత్యసాయి కల్యాణ మండపం జాతీయ చిత్ర కళా ప్రదర్శనకు ఆదివారం వేదిక కావడంతో ఈ చిత్ర కళా బ్రహ్మోత్సవానికి వివిధ రాష్ట్రాలకు చెందిన 450 చిత్రకారులు తరలివచ్చారు. సత్యసాయి కల్యాణ మండపం ఆద్యంతం రంగుల లోకంగా మారింది. వందల సంఖ్యలో ప్రదర్శితమైన చిత్రాలు కళా ప్రియులను రంజింప చేశాయి. ఆలోచింపచేశాయి. కోనసీమ చిత్ర కళా పరిషత్ ఆధ్వర్యంలో 35వ జాతీయ చిత్ర కళా పోటీలకు సంబంధించిన జాతీయ చిత్ర కళా ప్రదర్శనతో వందల చిత్రాలు కొలువుదీరాయి. పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి, చిత్రకారుడు కొరసాల సీతారామస్వామి పర్యవేక్షణలో ఈ చిత్ర కళా ప్రదర్శన జరిగింది. సీతారామస్వామి స్వీయ సేకరణతో దేశంలోని 215 మంది ప్రముఖ చిత్రకారుల చిత్రాలతో ముద్రితమైన 'అవర్ ఆర్టిస్ట్స్ బోర్న్ టు ఎక్సెల్' పుస్తకాన్ని చిత్రకారులతో కలసి పరిషత్ కార్యదర్శి సీతారామస్వామి సమీక్షించారు. నేటి ఆధునిక పోకడలకు అనుగుణంగా మారుతున్న చిత్ర కళపై చర్చించారు. దేశంలోని ఇంతమంది చిత్రకారుల ఫొటోలు, వారి వేసే చిత్ర కళ విధానాలను, వారి గురించి సమాచారాన్ని పుస్తకంలో పొందుపరిచిన సీతారామస్వామిని చిత్రకారులు అభినందించారు. అనంతరం పుస్తకంలో ప్రస్తావించిన 215 చిత్రకారులను కోనసీమ చిత్ర కళా పరిషత్ తరఫున సీతారామస్వామి ఘనంగా సత్కరించారు. చిత్ర బ్రహ్మోత్సవ లోగోను ఆవిష్కరించారు. తర్వాత జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.



జాతీయ చిత్ర కళా పోటీల విజేతలకు బహుమతులు అందించి సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

### చిత్ర కళలోని లోతులను అన్వేషిస్తున్నాం



దేశంలో ఎక్కడ చిత్ర కళాపోటీలు జరిగినా, చిత్ర కళా ప్రదర్శలు ఏర్పాటైనా వాటికి హాజరై తమ చిత్ర ప్రతిభను ప్రదర్శించడమే కాదు చిత్ర కళలోని లోతును అన్వేషిస్తున్నాం. కోనసీమ చిత్ర కళా పరిషత్ ఏటా నిర్వహించే జాతీయ పోటీల్లోనే కాదు చిత్ర కళా ప్రదర్శనల్లో కూడా పాల్గొంటున్నాను. వేల భావాలు తెలిపే చిత్ర కళా రంగమంటే నాకు ప్రాణం. ఆ అభిమానంతోనే మూడు దశాబ్దాలుగా చిత్రాలతోనే జీవిస్తున్నాను.

– హేమా కుట్నికర్, పూణె, మహారాష్ట్ర

### 51 జాతీయ చిత్రకళా పోటీల్లో పాల్గొన్నా



నేను ఇప్పటి వరకూ 51 జాతీయ చిత్ర కళా పోటీల్లో పాల్గొన్నాను. నేను గీసిన చిత్రాలకు బహుమతులు సాధించాను. మూడు దేశాల్లో ప్రపంచ చిత్ర కళా పోటీల్లో నా చిత్రాలు ప్రదర్శితమయ్యాయి. అమలాపురంలో అవర్ ఆర్టిస్ట్స్ పుస్తక సమీక్షకు నన్ను ఓ చిత్రకారుడిగా ఆహ్వానించడం ఆనందంగా ఉంది. ఇక్కడ ప్రదర్శితమైన చిత్రాలన్నీ ఒక దానికి మించి ఒకటి భావగర్భితంగా ఉన్నాయి.

– రహమాన్ పటేల్, చిత్రకారుడు, గుల్బర్గా, కర్ణాటక

### అమలాపురం చిత్ర ప్రదర్శనకు నాలుగోసారి



జాతీయ చిత్ర కళా ప్రదర్శనకు నేను రావడం ఇది నాలుగోసారి. కోనసీమ చిత్ర కళా పరిషత్ నిర్వహిస్తున్న జాతీయ చిత్ర కళా పోటీల్లో నా చిత్రం ప్రత్యేక బహుమతి సాధించింది. రెండున్నర దశాబ్దాల్లో నా చిత్ర కళకు మెచ్చి అనేక అవార్డులు తీసుకున్నాను. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ నిర్వహించే ప్రతి పోటీలోనూ నేను పాల్గొని అవార్డు కైవసం చేసుకున్నాను.

– శ్రీమంతుల శ్రీదేవి, చిత్రకారిణి, హైదరాబాద్

### ఐదుసార్లు అవార్డులు పొందాను




కోనసీమ చిత్ర కళా పరిషత్ ఏటా నిర్వహించే జాతీయ చిత్ర కళా పోటీల్లో పాల్గొంటూనే ఉంటాను. అయితే గత 35 ఏళ్లలో ఇప్పటి వరకూ 5 సార్లు ఈ పరిషత్ ద్వారా నేను గీసిన చిత్రాలకు అవార్డులు వచ్చాయి. నాలాంటి చిత్రకారులను ఎందరినో పరిషత్ ప్రోత్సహించి ఈ స్థాయికి తీసుకు వచ్చింది. నేను గీసిన చిత్రం ఈ జాతీయ పోటీల్లో అవార్డు పొందడమే కాకుండా జాతీయ చిత్రకళా ప్రదర్శనలో ప్రదర్శితం కావడం మరీ ఆనందం కలిగించింది.

– కాదూరి రామకృష్ణ, చిత్రకారుడు, బొబ్బిలి

## క్లుప్తంగా

### మిమ్స్ విద్యార్థి ఆత్మహత్య

- బ్యాక్‌లాగ్స్ ఉండిపోవడంతో మనస్తాపం
- సూసైడ్ నోట్ రాసి, పురుగుల మందు తాగేసి..
- కుమారుడి మృతితో విలపిస్తున్న తల్లిదండ్రులు



మృతుడు మణిదీప్ రాసిన సూసైడ్ నోట్



ఆత్మహత్యకు పాల్పడిన ఆత్కూరి సాయి మణిదీప్

నెల్లిమర్ల: తమ కుమారుడు వైద్యవృత్తిలో స్థిరపడతాడని ఆ తల్లిదండ్రులు ఎంతో సంబరపడిపోయారు. మరి కొన్నిరోజుల్లో ఎంబీబీఎస్ పట్టా పుచ్చుకుని, రోగులతో పాటు తమకు కూడా వైద్య సేవలు అందిస్తాడని ఆశపడ్డారు. అయితే వారి ఆశలు ఆడియాసలయ్యాయి. చేతికి అందివచ్చిన కొడుకు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎంబీబీఎస్ రెండో సంవత్సరం నుంచి బ్యాక్‌లాగ్స్ ఉండిపోవడంతో మనస్తాపానికి గురై, ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు, సహచర విద్యార్థులు అందించిన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా నెల్లిమర్లలో ఉన్న మిమ్స్ వైద్య కళాశాలలో తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన ఆత్కూరి సాయి మణిదీప్(24) ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఆదివారం ఉదయం కళాశాల ప్రాంగణంలో ఉన్న హాస్టల్ గదిలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆన్‌లైన్‌లో పురుగు మందు తెప్పించుకుని, కూల్ డ్రింకులో కలుపుకొని తాగేశాడు. విషయం తెలుసుకున్న సహచర విద్యార్థులు విషయాన్ని మిమ్స్ యాజమాన్యానికి తెలియజేశారు. యాజమాన్య ప్రతినిధులు నెల్లిమర్ల పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై గణేష్ సిబ్బందితో కలిసి వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాయి మణిదీప్ బెడ్ కింద పోలీసులకు సూసైడ్ నోట్ లభించింది. చదువు విషయంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఆ నోట్‌లో ప్రస్తావించాడు. బ్యాక్ లాగ్స్ ఎక్కువగా ఉండడం, చదువుపై ఏకాగ్రత లేక చనిపోతున్నట్లు రాశాడు. సూసైడ్ నోట్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

### మద్యం మత్తులో స్కూటీని ఢీకొన్న లారీ డ్రైవర్

ఒకరి పరిస్థితి విషయం



ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న భార్యను చికిత్స నిమిత్తం తరలిస్తున్న భర్త

గండేపల్లి: లారీ డ్రైవర్ మద్యం మత్తులో స్కూటీని ఢీకొట్టడంతో ఒకరు స్వల్పంగా గాయపడగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు, బంధువుల వివరాల మేరకు కిర్లంపూడికి చెందిన భార్యభర్తలు బండారు పెంటారావు, రమణమ్మ స్కూటీపై మండలంలోని నీలాద్రిరావుపేటలో బంధువుల ఇంటికి వస్తున్నారు. జెడ్ రాగంపేట పరిధిలో గల ఆదిత్య ఆస్పత్రి సమీపంలోకి వచ్చేసరికి విజయనగరం నుంచి నూకల లోడుతో రాజానగరం వెళుతున్న లారీ ముందు వెళుతున్న మరో లారీని తప్పించే ప్రయత్నంలో వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్య రమణమ్మ తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితికి చేరుకోగా భర్త పెంటారావు స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వైద్యులు ఆమె పరిస్థితి విషమంగా ఉందన్నారు. మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్‌ని, లారీని రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది గండేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# ఆదర్శ కృషీమణులు

- ప్రకృతి వ్యవసాయంలో ముందుకు
- ఈదరాడ కేంద్రంగా కార్యకలాపాలు





ద్రవ జీవామృతం తయారు చేస్తున్న మహిళలు

పాడి-పంట

మామిడికుదురు: ప్రకృతి వ్యవసాయం ద్వారా పలు పంటలు సాగు చేస్తూ మహిళా రైతులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. రసాయనిక వ్యవసాయం వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు, రైతులకు వివరించి వారిలో చైతన్యం తీసుకువస్తున్నారు. ప్రకృతిలో లభించే సహజమైన పదార్థాలతో జీవామృతం, కషాయాలు తయారు చేసి వాటితో వ్యవసాయం చేస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని ఈ మహిళలు నిరూపిస్తున్నారు. ఈదరాడ గ్రామానికి చెందిన పలువురు మహిళలు వరి, కొబ్బరితో పాటు అంతర పంటలుగా పసుపు, కంద, అరటి, పెసలు, మినుములు, 18 నుంచి 21 రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. వంకాయ, బీర, బెండ, టమాటా, మిర్చి, కాకర, ఆనబ, అరటి, ముల్లంగి, అల్లం, కంద, కొత్తిమీర, చుక్క కూర, పాలకూర, మెంతికూర, తోట కూర, బచ్చలి, గోంగూర, పుదీనా, కరివేపాకు వంటి పంటలను సాగు చేస్తున్నారు.

**88 మంది మహిళా రైతులు**

ఈదరాడ, మాకనపాలెం గ్రామాల్లో సుమారు 88 మంది మహిళలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. కిచెన్ గార్డెన్లతో పాటు పలువురు మహిళలు ఇతర పంటలు కూడా సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో 365 రోజులు పంటలు సాగు చేయడం వల్ల భూమిలో సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందుతాయని, భూ సారం పెరుగుతుందని మహిళా రైతులు చెబుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో బహుళ పంటల విధానంతో దిగుబడులు పెరగడంతో పాటు చీడపీడల బెడద తొలగి పోతుందని పేర్కొంటున్నారు. ప్రజల జీవన విధానంలో వస్తున్న మార్పుల వల్ల చాలామంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ విధానం ఏమంత కష్టం కాకపోవడంతో రైతులు ఈ దిశగా చైతన్యవంతులవుతున్నారు.



బీజామృతంలో వరి నారు శుద్ధి చేయడం



ఈదరాడలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

### ఏడేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా



ఏడేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. ఇదే పద్ధతిలో ఎకరా 50 సెంట్ల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నా. 60 సెంట్లలో కొబ్బరి సాగు చేస్తున్నా. కొబ్బరి తోటల్లోనే ఏటీఎం మోడల్‌లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. 365 రోజులు నేలను పచ్చదనంతో వ్యవసాయానికి అవసరమైన విధంగా ఉంచుతున్నాం. ప్రకృతి వ్యవసాయం వల్ల తక్కువ ఖర్చుతో పంటలు సాగు చేసి మంచి దిగుబడులు సాధిస్తున్నాం. ఈ తరహాలో పండించిన వాటికి మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఏర్పడి గణనీయమైన ఆదాయం వస్తోంది.

– కుడుపూడి జానకి, మహిళా రైతు, ఈదరాడ

### ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుంది



మూడేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. అర ఎకరంలో వరి పండించడంతో పాటు ఎకరా 20 సెంట్ల కొబ్బరి తోటలో అంతర పంటలు సాగు చేస్తున్నాం. కెమికల్స్‌తో కూడిన ఎరువులు, క్రిమి సంహారక మందులతో సాగు చేసిన ఆహారం తినడం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటల వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగు పడుతుంది. మేము ప్రకృతి వ్యవసాయంలో పండిస్తున్న పంటలకు మంచి డిమాండ్ ఉంది. వాటినే అందరూ ఇష్టపడుతున్నారు. నాతో పాటు చాలామంది మహిళలు ఇదే తరహాలో వ్యవసాయం చేస్తున్నారు.

– చెల్లుబోయిన రాధ, మహిళా రైతు, ఈదరాడ

### ఆకు కూరలు తాజాగా ఉంటున్నాయి



2018 నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. ఎకరం విస్తీర్ణంలో వరి, 20 సెంట్లలో ఏటీఎం తరహాలో దుంప కూరలు, ఆకు కూరలు పండిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయంలో పండించే పంట ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటుంది. ఆకు కూరలు సైతం త్వరగా పాడైపోయే అవకాశం లేదు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు ఖర్చు తక్కువ అవుతుంది. ఆదాయం ఎక్కువ వస్తుంది. ఈ పద్ధతిలోనే ఆర్ఎన్ఆర్ రకం వరి పండిస్తున్నాం. ఇది కూడా మంచి దిగుబడిని ఇస్తుంది. ఈ వరి సుగర్ పేషెంట్లతో పాటు ఇతరులకు ఎంతో ఆరోగ్యకరంగా ఉంటుంది.

– కుసుమ పద్మావతి, మహిళా రైతు, కదలి

### జిల్లాలో 10 వేల మంది మహిళా రైతులు



కోనసీమ జిల్లాలో పది వేల మంది మహిళలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం మనిషి ఆరోగ్యాన్ని పెంచుతుంది. రసాయనిక వ్యవసాయంలో మూడు మూలకాలు మాత్రమే ఎక్కువగా లభ్యమవుతాయి. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పంటల నుంచి 59 మూలకాలు లభ్యమవుతాయి. దీని ద్వారా రైతులకు సాగు ఖర్చు తగ్గుతుంది. పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. మహిళా సంఘం సభ్యులు కూడా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు దోహదపడుతుంది. రైతు శాస్త్రవేత్తలు, మోడల్ మేకర్స్‌తో పాటు ఇతరులు మహిళా రైతులకు తోడుగా ఉంటున్నారు.

– జె.ఎలియాజర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్, ప్రకృతి వ్యవసాయం, కోనసీమ

### అంబాజీపేట కొబ్బరి మార్కెట్




| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్తకొబ్బరి (క్వింటాల్) | 14,000 – 14,500 |
| కొత్తకొబ్బరి (రెండవ రకం) | 9,500 – 10,000 |
| కురిడీ కొబ్బరి (పాతవి) | |
| గండేరా (వెయ్యి) | 20,000 |
| గటగట (వెయ్యి) | 17,500 |
| కురిడీ కొబ్బరి (కొత్తవి) | |
| గండేరా (వెయ్యి) | 19,000 |
| గటగట (వెయ్యి) | 16,500 |
| నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 15,000 – 15,500 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 15,000 – 15,500 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 3,750 |
| ఒక కిలో | 260 |

### లారీ ఢీకొని యువకుడి మృతి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని జాతీయ రహదారిపై ధర్మవరం పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఏలేశ్వరం మండలం పేరవరం గ్రామానికి చెందిన రామమణి శివ (22) తునిలో బంధువుల ఇంట జరిగే శుభకార్యానికి హాజరయ్యేందుకు బైక్ పై బయలుదేరాడు. జాతీయ రహదారిపై ధర్మవరం పెట్రోల్ బంకు వద్ద అతని వెనుక ఉన్న వాహనాన్ని ట్యాంకర్ ఓవర్ టేక్ చేస్తూ శివ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివ అక్కడికక్కడే మృతి చెందాడు. శివ బైక్ వెనుక అతని బావ, అత్త గొంప భాను, నారాయణమ్మ మరో బైక్ పై బయలుదేరారు. కళ్లముందే శివ మృతి చెందడంతో అత్త,బావ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. మృతుడి తల్లిదండ్రులు పేరవరం గ్రామంలో వ్యవసాయ కూలి పనులు, మేకలు, గొర్రెలను మేపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. వారి కుటుంబానికి శివ చేదోడువాదోడుగా ఉండేవాడు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

# నిజాన్ని నిగ్గు తేల్చండి



కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం



దేవస్థానం కార్యాలయంలోని మద్యం సీసాలు

- నరసింహస్వామి దేవస్థానంలో మద్యం సీసాలు, బిర్యానీ ప్యాకెట్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన దేవస్థానం సిబ్బంది

మధురపూడి: పవిత్ర పుణ్యక్షేత్రమైన కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మద్యం సీసాలు, బిర్యానీ ప్యాకెట్‌లు దర్శనమిచ్చినట్టు జరుగుతున్న ప్రచారంలో నిజాన్ని నిగ్గుతేల్చడంలో అధికారులు విఫలమయ్యారు. స్వామివారి క్షేత్రంలో అపవిత్ర కార్యకలాపాలు సాగుతున్నట్టు సోషల్ మీడియా ద్వారా ప్రచారం అవుతోంది. కోరుకొండలో కొలువుదీరిన స్వయం భు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయితే ఈ ప్రచారంతో భక్తులు మనోవేదనకు గురవుతున్నారు. అసలు ఏం జరిగిందంటూ చర్చించుకుంటున్నారు. ఈ క్షేత్రాన్ని అన్నవరం శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానం దత్తత తీసుకున్న సంగతి తెల్సిందే. దేవస్థానం కార్యాలయంలో మద్యం సీసాలు, బిర్యానీ ప్యాకెట్లు ఉన్న ఫొటోలు వైరల్ అవ్వడంపై దేవదాయశాఖ అధికారులకు నిజాన్ని నిగ్గు తేల్చాల్సిన బాధ్యత ఉంది. కొంతకాలంగా ఈ ప్రచారం జరుగుతున్నా చర్యలు తీసుకొనకపోవడంపై భక్తుల్లో అసహనం చోటుచేసుకుంది.

**పట్టించుకోని స్థానిక ప్రజాప్రతినిధులు**

కూటమి ప్రభుత్వ పాలన ప్రారంభమై ఏడు నెలలు పూర్తయింది. కాగా దేవ స్థానంలో మూడు నెలలుగా ప్రచారం జరుగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోకపోవడంతో ఈ దుస్సాహసాలకు అండగా ఉన్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే ఇటీవల వెల్లడయిన ఫొటోలతో చర్చ జోరుగా సాగుతోంది. దేవస్థానం కార్యాలయం తాళాలు తీసి ఎవరో కావాలని దురుద్దేశంతో మద్యం సీసాలను అక్కడ పెట్టారని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

**పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు**

శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం కార్యాలయంలో మద్యం సీసాలను ఎవరో ఉంచారని ఆలయ రికార్డ్ అసిస్టెంట్‌లు ఆర్.రవికుమార్, ఎన్.నాగరాజు శుక్రవారం కోరుకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో చర్చ మరోవైపునకు తిరిగింది.కార్యాలయం లోపలకు చొరబడి మద్యం సీసాలు, మాంసాహారం టేబుల్‌పైన ఉంచారని, వారిని పట్టుకుని శిక్షించాలని సిబ్బంది ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యాలయం తాళాలను బయట బోర్డుపైన ఉంచడంతో ఈ దుర్మార్గానికి పాల్పడ్డారని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఆలయ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని కోరుకొండ ఎస్ఐ శ్యామ్ సుందర్ ఆదివారం తెలిపారు.

# సినీ పరిశ్రమకు తోడ్పాటు ఇవ్వాలి

- స్థానిక కళాకారులకు, కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలి
- సినీ వర్కర్స్ సొసైటీ ప్రతినిధుల విజ్ఞప్తి



కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ఆంధ్రప్రదేశ్‌లో సినీ పరిశ్రమ నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, స్థానికులకు ప్రాధాన్యం కల్పించాలని పలువురు కోరారు. ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సారథ్యాన నెలకొల్పిన ఆంధ్రప్రదేశ్ సినీ వర్కర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ఆదివారం జరిగింది. సొసైటీ చైర్మన్‌గా తోరం రాజా, వైస్ చైర్మన్‌గా కొండపల్లి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా పంపన సత్యనారాయణ, కోశాధికారిగా ముళ్ళపూడి రాధ, పదిమంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. 2016లో ఏర్పాటైన ఫెడరేషన్‌కు అనుబంధంగా సొసైటీ స్థాపించి, తొలి సమావేశం ఇక్కడ ఏర్పాటు చేశామని తోరం రాజా తెలిపారు. అలాగే ఫిల్మ్ నగర్ క్లబ్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, సినీ కార్మికులకు న్యాయం చేయడానికి కృషి చేస్తామని అన్నారు. షూటింగ్‌లకు అనువుగా ఉన్న మన రాష్ట్రానికి నిర్మాతలు వస్తారని భావిస్తున్నామన్నారు. ఇక్కడ షూటింగ్‌లు చేస్తే, 80 శాతం స్థానికులకే అవకాశాలివ్వాలనే నిబంధన అమలవుతుందని, తద్వారా ఇక్కడి కళాకారులకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే అఖిల భారత స్థాయి కార్మిక మంత్రుల సమావేశం దృష్టికి సినీ కార్మికుల సమస్యలు తీసుకెళ్తానని తెలిపారు.

సినీ నటుడు భానుచందర్ మాట్లాడుతూ, ఇక్కడి కార్మికులు మట్టిలో మాణిక్యాలని అన్నారు. సంగీత దర్శకుడిగా అందరికీ సుపరిచితులైన తన తండ్రి మాస్టర్ వేణు బందరు వాసి అని, తన తల్లిది రాజమహేంద్రవరమని, అప్పట్లో ఆమె చాలా మంది అగ్ర నటులకు పచ్చ కామెర్ల మందు ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. నటుడు పిల్లా లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ, తమను తెలంగాణ నుంచి పొమ్మంటున్నారని, ప్రభుత్వం, రాజకీయ నాయకులు పట్టించుకుని తమకు ఇక్కడ అవకాశాలు కల్పించాలని, ఇళ్లు లేని ఆర్టిస్టులకు, కార్మికులకు ఇళ్లు ఇవ్వాలని కోరారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్,డ గోరంట్ల బుచ్చయ్య చౌదరి కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆకుల వీర్రాజు, వేతన బోర్డు మాజీ చైర్మన్ ఆర్.రామ్మోహనరావు, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేశవరావు, పంతం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# సమాజాన్ని సన్మార్గంలో నడిపేది పీఠాధిపతులే

- ధర్మ పరిరక్షణకు పీఠాలు కృషి చేస్తాయి
- హైకోర్టు రిటైర్డ్ జడ్జి దుర్గా ప్రసాదరావు
- ఘనంగా గాడ్ 89వ జన్మదిన వేడుకలు



సాగరఘోష కవి డాక్టర్ గరికపాటి నరసింహారావును సత్కరిస్తున్న పీఠం ప్రతినిధులు



గాడ్ జన్మదిన వేడుకలనుద్దేశించి ప్రసంగిస్తున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి దుర్గాప్రసాదరావు

రాయవరం: మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించి, సమాజాన్ని సన్మార్గం వైపు నడిపించేది పీఠాధిపతులేనని హైకోర్టు రిటైర్డ్ జడ్జి యు.దుర్గాప్రసాదరావు పేర్కొన్నారు. రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) 89వ జన్మదిన వేడుకలు ఆదివారం పీఠంలో ఘనంగా నిర్వహించారు. సాహితీవేత్త డాక్టర్ యర్రాప్రగడ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రిటైర్డ్ జడ్జి దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ గాడ్ ఇచ్చే సందేశాన్ని మన జీవితాలకు అన్వయించుకుని మంచి మార్గంలో నడవాలన్నారు. పీఠాలు ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నాయన్నారు.

మనిషిలోని మానవత్వాన్ని మేల్కొలిపి, సన్మార్గంలో నడిపే విధంగా పీఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. సమావేశంలో ప్రముఖ వస్త్ర వ్యాపారి తుమ్మిడి రామ్‌కుమార్, సాహితీవేత్త ఆకెళ్ల విభీషణశర్మ, రిటైర్డ్ ప్రసార భారతి డిప్యూటీ డైరెక్టర్ ఆర్.అనంత పద్మనాభరావు, శ్రీరంగం దేవస్థానం సంస్థానాచార్యులు పరాశర లక్ష్మీనరసింహభట్టు, సాహితీవేత్త చిలకపాటి విజయరాఘవాచార్యులు, మేడసాని మోహన్, సాగరఘోష కవి, సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి తదితరులు విజయదుర్గాపీఠం ఆధ్యాత్మికతకు కేంద్రబిందువుగా భాసిల్లుతోందన్నారు. పీఠంలో బాంధవ్య విలువలు, ఆత్మీయత, అనురాగం, ఆప్యాయతలు లభిస్తాయన్నారు. అనంతరం వారు గాడ్ ఆశీస్సులు పొందారు. పిఠాపురం నుంచి వచ్చిన కవి కోట శ్రీను రచించిన «గాడ్ వైభవం» పుస్తకాన్ని సాహితీవేత్తలు ఆవిష్కరించారు. గాడ్ చిత్రపటంతో ఉన్న పోస్టల్ స్టాంప్‌ను అతిథులు ఆవిష్కరించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు సభా నిర్వహణ చేశారు.

**ధర్మ, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి**

ప్రతి ఒక్కరూ ధర్మ, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, మంచి ఆలోచనలు చేసే వారికి దైవం తోడుగా ఉంటుందని పీఠాధిపతి గాడ్ అన్నారు. భక్తులనుద్దేశించి ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ మంచి పనులు చేసేవారికి అమ్మదయ ఎన్నడూ ఉంటుందన్నారు. లోక కల్యాణం కోసం నిత్యం పీఠంలో అనేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు గాడ్ తెలిపారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త కోట సునీల్‌కుమార్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, బి.రమ, పి.సత్యకనకదుర్గ, వాడ్రేవు వేణుగోపాల్ పాల్గొన్నారు.

### హోంగార్డు నిజాయితీ

హ్యాండ్‌బ్యాగ్‌ను అప్పగిస్తున్న హోంగార్డు అర్జున్ →



అన్నవరం: భక్తులు మర్చిపోయిన రూ.52 వేల నగదుతో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను తిరిగి వారికి అప్పగించిన హోంగార్డు అర్జున్ నిజాయితీని పలువురు అభినందించారు. వివరాల్లోకి వెడితే శ్రీకాకుళం పట్టణానికి చెందిన భక్తులు ఆదివారం సత్యదేవుని ఆలయానికి విచ్చేశారు. వారు కారు పార్కింగ్ వద్ద రూ.52 వేల నగదుతో గల హ్యాండ్‌బ్యాగ్‌ను మర్చిపోయి వెళ్లిపోయారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న హోంగార్డు అర్జున్ ఆ బ్యాగ్‌ను చూసి దానిని దేవస్థానంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గల సిబ్బందికి అందజేశారు. సిబ్బంది ఈ విషయాన్ని మైకులో ప్రకటించడంతో శ్రీకాకుళం భక్తులు అక్కడకు వచ్చి తమ బ్యాగ్ ఆనవాలు చెప్పడంతో ఆ బ్యాగ్‌ను వారికి అప్పగించారు. ఈ విషయంలో హోంగార్డు అర్జున్ నిజాయితీని అందరూ మెచ్చుకున్నారు.

# తల్లీకూతుళ్లకు విద్యుత్ షాక్

- తీవ్ర గాయంతో చిన్నారికి చేయిని తీసేసిన వైద్యులు
- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం



విద్యుత్ షాక్‌తో చేయి కోల్పోయిన లాస్య మాధురి

అల్లవరం: ఆ పాపకి విద్యుత్ షాక్ జీవితాంతం విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటన అల్లవరం మండలం గోడి కొత్త కాలనీలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. కాకినాడలో నివాసం ఉంటున్న కేతా రమాదేవి సంక్రాంతి పండగకి గోడి కొత్త కాలనీలో పుట్టింటికి తన కుమార్తె లాస్యమాధురితో వచ్చింది. శనివారం ఉదయం బియ్యాన్ని కడిగి ఆరబెట్టేందుకు రమాదేవి డాబాపైకి వెళ్లింది. రమాదేవితో పాటుగా లాస్య కుడా వెళ్లింది. తల్లి రమాదేవి బియ్యాన్ని ఆరబెడుతున్న సమయంలో డాబాకి దగ్గరలో ఉన్న 11 కేవీ కరెంట్ వైర్లు లాస్యకి తగిలాయి. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన లాస్యని రమాదేవి కాపాడేప్రయత్నం చేసి లాగబోయింది. దీంతో ఇద్దరూ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. లాస్య కుడి చేతికి మంటలు వ్యాపించి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడిన లాస్య కుడి చేతిని ఆదివారం ఉదయం జీజీహెచ్ వైద్యులు తొలగించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా లాస్యకు తీరని నష్టం జరిగిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. సంక్రాంతి పండగకు వచ్చిన ముద్దుల మనవరాలికి ఈ గతి పట్టిందని అమ్మమ్మ, తాతయ్య కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇంటికి ఆనుకుని విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసేటప్పుడు కనీసం మీటరు దూరం లేకుండా సర్వీసు వైర్లు నడిపారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు విద్యుత్ వైర్లతో ముప్పు ఉందని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ట్రాన్స్‌కో అధికారులు పెడ చెవిన పెట్టారని తెలిపారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి అల్లవరం పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

# ఏడుపదుల వయసులో స్నేహితుల భేటీ





రాజోలులో కలుసుకున్న 1969-70 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

రాజోలు: వారందరిదీ ఏడు పదులు వయసు... స్నేహితులంతా ఒకచోట చేరుకున్నారు. తమ జీవితంలో ఎదుర్కొన్న కష్టాలను..సుఖాలను స్నేహితులతో పంచుకున్నారు. చిన్నతనంలోని చిలిపి చేష్టలను నెమరు వేసుకున్నారు. ఐదున్నర దశాబ్దాల క్రితం రాజోలు బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి మొదటి బ్యాచ్ (1969–70) పూర్వ విద్యార్థులు 10వ ఆత్మీయ కలయిక నిర్వహించారు. స్థానిక యూత్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయికకు చెన్నై, విశాఖపట్టణం, హైదరాబాద్, విజయవాడ, కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో స్థిరపడిన 35 మంది వచ్చారు. మూడు నెలలుగా స్నేహితులకు ఫోన్‌లు చేసి ఒకచోట కలిసేలా ఏర్పాట్లు చేసిన తమ స్నేహితుడు కోళ్ల వెంకన్నను అభినందించారు.